క్లుప్తంగా

దివ్యాంగులకు ఫిజియోథెరపీ సేవలు



దివ్యాంగ చిన్నారితో వ్యాయామం చేయిస్తున్న ఫిజియోథెరపిస్టు సోమేశ్వరరావు

కోటనందూరు: స్థానిక నాన్‌భవిత కేంద్రంలో దివ్యాంగ చిన్నారులకు బుధవారం ఫిజియోథెరపీ సేవలు అందించారు. ఫిజియోథెరపిస్టు టీఎస్ఎస్ సోమేశ్వరరావు చిన్నారులతో వ్యాయామాలు చేయించారు. చిన్నారుల ఆరోగ్యం, వ్యాయామాల పరంగా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమాన్ని ఎంఈఓలు శ్రీనివాస్, రామశేఖర్ పరిశీలించారు. ఐఈఆర్పీ ఆర్ నారాయణరావు పాల్గొన్నారు.

నారాయణకు డాక్టరేట్



కోన నారాయణ

ఏలేశ్వరం: పట్టణానికి చెందిన కోన నారాయణకు గుంటూరు ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం డాక్టరేట్ ప్రదానం చేసింది. ఆంధ్ర విశ్వ విద్యాలయం తెలుగు విభాగంలో అసోసియేట్ ప్రొఫెసర్‌గా పని చేస్తున్న డాక్టర్ బూసి వెంకటస్వామి పర్యవేక్షణలో యంవీజే భువనేశ్వరరావు కథ సాహిత్యం–ఒక పరిశీలన అనే అంశంపై నారాయణ చేసిన పరిశోధనలకు గాను డాక్టరేట్ లభించింది. డాక్టరేట్ పొందిన నారాయణను పలువురు అభినందించారు.

నేడు మంత్రి రాజా పర్యటన

తుని: రాష్ట్ర రోడ్లు, భవనాలశాఖ మంత్రి దాడిశెట్టి రాజా గురువారం తుని పట్టణంలో పర్యటిస్తారని మున్సిపల్ కమిషనర్ ప్రసాదరాజు బుధవారం తెలిపారు. ఉదయం 10.30 గంటలకు స్థానిక కొండవారిపేట రావిచెట్టు వద్ద నిర్మించిన ఆది ఆంధ్ర కమ్యూనిటీ హాలును మంత్రి ప్రారంభిస్తారన్నారు. 11 గంటలకు 12వ వార్డు ఏటిఒడ్డువీధిలో నిర్మించిన కమ్యూనిటీ హాలును ప్రారంభిస్తారని చెప్పారు. మున్సిపల్ కౌన్సిలర్లు, నాయకులు హాజరు కావాలని ఆయన కోరారు.

విద్యార్థులకు టెక్నాలజీపై అవగాహన

తుని: విద్యార్థి దశ నుంచే సాంకేతికతపై అవగాహన పెంచుకోవాలని రోటరీక్లబ్ తుని శాఖ అధ్యక్షుడు వర్మ సూచించారు. స్థానిక లయోలా స్కూల్‌లో 8, 9 తరగతులకు చెందిన విద్యార్థులకు బుధవారం ఎలక్ట్రికల్, కార్పెంటర్, ప్లంబిగ్, పెయింటింగ్, టైలరింగ్, ఫొటోగ్రఫీ వృత్తులపై నిపుణులతో శిక్షణ ఇచ్చామన్నారు. విద్యార్థులు ఇష్టమైన వృత్తిని ఎంచుకొని జీవితంలో నిలదొక్కుకోవాలన్నారు. పేద విద్యార్థులకు రోటరీ క్లబ్ అండగా నిలుస్తోందన్నారు. పలు వృత్తుల్లో ప్రావీణ్యం కలిగిన పలువురిని సత్కరించారు. రోటరీక్లబ్ తుని శాఖ కార్యదర్శి కిశోర్‌రెడ్డి, కోశాధికారి కోరుకొండ గణేష్, సీహెచ్ మంగరాజు, డీవీ. రాజు, మధుసూదన్, రామచంద్రరావు, నాగ సురేష్ పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక



నూతన కార్యవర్గాన్ని సత్కరించిన సభ్యులు

తుని: తుని యునైటెడ్ పాస్టర్ ఫెలోషిప్ నూతన కార్యవర్గ అధ్యక్షుడిగా పాస్టర్ వి.ప్రసాద్‌బాబు ఎన్నికయ్యారు. తుని గణపతినగర్‌లోని హోలీ చర్చిలో బుధవారం నిర్వహించిన సమావేశంలో నూతన కార్యవర్గ ఎన్నిక జరిగింది. సంఘ అధ్యక్షుడిగా ప్రసాద్‌బాబు, కార్యదర్శిగా పాస్టర్ కిశోర్, కోశాధికారిగా ఐజాక్, కార్యవర్గ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. రెండేళ్ల పాటు నూతన కార్యవర్గం పని చేస్తోందని సంఘ నాయకులు జయకుమార్, నరేంద్ర తెలిపారు. సంఘం బలోపేతానికి కృషి చేస్తామని ప్రసాదబాబు తెలిపారు. నూతన కార్యవర్గాన్ని సభ్యులు పూలమాల, శాలువాతో సత్కరించారు.

ఆర్టీసీ డ్రైవర్లు భద్రతా నియమాలు పాటించాలి



గోకవరం ఆర్టీసీ బస్సులో డ్రైవర్‌కు గులాబీ పువ్వు ఇస్తున్న డీఎం రామన్నదొర

గోకవరం: ఆర్టీసీ డ్రైవర్లు భద్రతా నియమాలు పాటించాలని గోకవరం ఆర్టీసీ డిపో మేనేజర్ యు.రామన్నదొర సూచించారు. రహదారి భద్రతా వారోత్సవాల్లో భాగంగా బుధవారం స్థానిక ఆర్టీసీ డిపోలో డ్రైవర్స్ డే నిర్వహించారు. ఆర్టీసీ బస్సు డ్రైవర్ల ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి వారికి తినిపించారు. అలాగే డ్యూటీలో ఉన్న డ్రైవర్లకు, ప్రయాణికులు గులాబీ పువ్వులు, స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సీనియర్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ ఎ.అప్పారావు, ఎంప్లాయిస్, ఎన్ఎంయూ, కార్మిక పరిషత్ యునైటెడ్ వర్కర్స్, ఎస్‌డబ్ల్యూఎఫ్ నాయకులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

క్రీడలతో శారీరక, మానసిక ఆరోగ్యం

- మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి తోట నరసింహం
- రాజపూడిలో నియోజకవర్గస్థాయి ఆడుదాం ఆంధ్రా పోటీలు ప్రారంభం



రాజపూడిలో బ్యాటింగ్ చేసి క్రీడా పోటీలను ప్రారంభిస్తున్న మాజీ మంత్రి తోట నరసింహం

జగ్గంపేట: క్రీడలతో శారీరక, మానసిక ఆరోగ్యం కలుగుతుందని మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జగ్గంపేట నియోజకవర్గ ఇన్‌చార్జి తోట నరసింహం అన్నారు. మండలంలోని రాజపూడిలో నియోజకవర్గస్థాయి ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలను బుధవారం ఆయన ప్రారంభించారు. క్రీడాకారులను పరిచయం చేసుకుని ఆల్ ది బెస్ట్ చెప్పారు. కొంతసేపు తోట నరసింహం క్రికెట్ బ్యాటింగ్ చేయగా ఆయన తనయుడు రాంజీ బౌలింగ్ వేసి అందరినీ ఆకట్టుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ క్రీడాకారుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీసేందుకే ప్రభుత్వం ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలు నిర్వహిస్తోందన్నారు. గతంలో ఏ ప్రభుత్వం కూడా క్రీడాకారులను ఇంతలా ప్రోత్సహించలేదన్నారు. క్రీడాకారులు ఈ పోటీల్లో ప్రతిభ చూపి జిల్లా, రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక కావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సేవాదళ్ రాష్ట్ర కార్యదర్శి ఒమ్మి రఘురాం, జిల్లా వక్ఫ్‌బోర్డు మాజీ అధ్యక్షుడు గఫూర్, యువనేత తోట రాంజీ, పార్టీ సీనియర్ నేతలు అత్తులూరి సాయిబాబు, తులా రాము, తోట అయ్యన్న, రాజపూడి గ్రామ సర్పంచ్ బూసాల విష్ణు, ఎంపీడీఓ వసంత కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి నియోజకవర్గ స్థాయి క్రీడా పోటీలు

ప్రత్తిపాడు: ఆడుదాం.. ఆంధ్రా నియోజకవర్గస్థాయి క్రీడా పోటీలను గురువారం నుంచి నిర్వహించనున్నట్టు ఎంపీడీఓ ఎంవీఆర్ కుమార్‌బాబు బుధవారం తెలిపారు. మండలస్థాయి క్రీడా పోటీల్లో విజయం సాధించిన జట్లు ఈ పోటీల్లో పాల్గొంటాయని చెప్పారు. ఈ నెల 25న శంఖవరం మండలం కత్తిపూడి హైస్కూల్ మైదానంలో పురుషుల క్రికెట్, ప్రత్తిపాడు మండలం ధర్మవరం హైస్కూల్ మైదానంలో పురుషుల కబడ్డీ, వాలీబాల్, ఖోఖో, మహిళల కబడ్డీ, వాలీబాల్, ఖోఖో పోటీలు జరుగుతాయన్నారు. ప్రత్తిపాడు మండల విద్యాశాఖ కార్యాలయం వద్ద మెన్ డబుల్ బ్యాడ్మింటన్, మహిళల డబుల్స్ బ్యాడ్మింటిన్ పోటీలు నిర్వహిస్తామన్నారు. 27న కత్తిపూడి హైస్కూల్‌లో మహిళల క్రికెట్ పోటీలు జరుగుతాయన్నారు. నియోజకవర్గ స్థాయి పోటీల్లో గెలుపొందిన జట్లు జిల్లాస్థాయి పోటీలకు అర్హత సాధిస్తాయని ఎంపీడీఓ కుమార్ బాబు తెలిపారు.

ఆడుదాం ఆంధ్రా క్రీడలకు అనూహ్య స్పందన



తుని సభలో మాట్లాడుతున్న చైర్‌పర్సన్ సుధారాణి

తుని: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఆడుదాం ఆంధ్రా క్రీడలకు అనూహ్య స్పందన లభిస్తోందని మున్సిపల్ చైర్‌పర్సన్ ఏలూరి సుధారాణి అన్నారు. స్థానిక రాజా కళాశాల మైదానంలో బుధవారం నియోజకవర్గ స్థాయి క్రీడా పోటీలను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా సుధారాణి మాట్లాడుతూ క్రీడలతో శారీరక దృఢత్వం, గుర్తింపు లభిస్తాయన్నారు. గత ప్రభుత్వం రాజా కళాశాల మైదానం అభివృద్ధిని పట్టించుకోలేదన్నారు. వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చాక రాష్ట్ర రోడ్లు, భవనాలశాఖ మంత్రి దాడిశెట్టి రాజా చొరవతో రాజా కళాశాల మైదానం అభివృద్ధి చేశారని తెలిపారు. ప్రభుత్వం నిర్వహిస్తున్న ఆడుదాం ఆంధ్రా పోటీల ద్వారా రాష్ట్ర స్థాయిలో ప్రతిభ చూపే అవకాశం యువతకు లభించిందన్నారు. వైఎస్సార్ సీపీ యువజన విభాగం తుని నియోజకవర్గం అధ్యక్షుడు ఏలూరి బాలు, పార్టీ తుని మండల మాజీ అధ్యక్షుడు పోతల రమణ, అధికారులు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

ఏలేరు జలాశయంలోకి చేప పిల్లలు



ఏలేరు ప్రాజెక్టులో చేపపిల్లలు వదులుతున్న అధికారులు

ఏలేశ్వరం: స్థానిక ఏలేరు జయశయంలోకి బుధవారం పెంపకం నిమిత్తం మత్స్యశాఖ ఆధ్వర్యంలో చేపపిల్లలను వదిలాదు. ప్రధానమంత్రి మత్స్యసంపద యోజనలో భాగంగా రెండో విడత సుమారు 11.40 లక్షల చేపపిల్లలను స్థానిక ఏలేరు ప్రాజెక్టులో వదిలిపెట్టారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ ప్రభుత్వం మత్స్యకారుల అభివృద్ధికి కృషి చేస్తోందన్నారు. మత్స్యకారుల ఉపాధి నిమిత్తం ఏలేరు ప్రాజెక్టులో చేప పిల్లలను పెంచుతున్నట్లు తెలిపారు. మత్స్యకారులకు ప్రభుత్వం కల్పిస్తున్న సదుపాయాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ చిన్నారావు, మున్సిపల్ కమిషనర్ కె.శ్రీనివాసరావు, ఏడీ లావణ్య, ఎఫ్‌డీఓలు ఉప్పాడ శ్రీరామకృష్ణ, ఇన్‌స్పెక్టర్ రాజేంద్రరావు, సిబ్బంది శ్రీనుబాబు, అచ్చిరాజు, సునీత, మౌనిక తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ విజయం ఖాయం

- ఆ పార్టీ నియోజకవర్గ కో ఆర్డినేటర్ వరుపుల సుబ్బారావు
- కొంతంగి, అచ్చంపేట గ్రామాల్లో ఆత్మీయ సమావేశాలు



కొంతంగి ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న వరుపుల సుబ్బారావు

శంఖవరం: వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ విజయం సాధించి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రెండోసారి ముఖ్యమంత్రి కావడం ఖాయమని మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ ప్రత్తిపాడు నియోజకవర్గ కో ఆర్డినేటర్ వరుపుల సుబ్బారావు అన్నారు. మండలంలోని కొంతంగిలో సర్పంచ్ దూడల రామస్వామి, మాజీ సర్పంచ్ గింజాల కొండబాబు, అచ్చంపేటలో సర్పంచ్ బొట్టా చైతన్య ఆధ్వర్యంలో బుధవారం ఆత్మీయ సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వరుపుల సుబ్బారావు మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ విజయమే లక్ష్యంగా పార్టీ శ్రేణులు కష్టించి పని చేయాలన్నారు. పార్టీ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లి పార్టీని మరింత బలోపేతం చేయాలన్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో రాజకీయాలకు అతీతంగా అన్ని వర్గాలకు మేలు జరిగిందన్నారు. వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీని గెలిపించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ పర్వత రాజబాబు, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ప్రచార కార్యదర్శి రావూరి వెంకటేశ్వరరావు, పార్టీ మండల కన్వీనర్ నరాల శ్రీను, సర్పంచులు ఈగల విజయదుర్గ, సకురు గుర్రాజు, గొనగాల అప్పలరాజు, వైఎస్సార్ సీపీ నాయకులు పల్లా సత్యనారాయణ, బత్తుల శివ, కుంచే రత్నాలు, గింజాల లోవరాజు తదితరులు పాల్గొన్నారు.

పారదర్శకంగా గృహ నిర్మాణాలు

- ఎంపీపీ గోళ్ల కాంతి సుధాకర్
- జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలపై సమీక్ష



జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలపై సమీక్షిస్తున్న ఎంపీపీ కాంతి సుధాకర్

ప్రత్తిపాడు: నవరత్నాలు – పేదలందరికీ ఇళ్లు పథకంలో గృహ నిర్మాణాలు పారదర్శకంగా చేపట్టాలని ఎంపీపీ గోళ్ల కాంతి సుధాకర్ అధికారులకు సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నవరత్నాలు–పేదలందరికీ ఇళ్లు పథకంపై బుధవారం సమగ్ర సమీక్ష (మెగా కంప్లీషన్ డ్రైవ్) నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ కాంతి సుధాకర్ మాట్లాడుతూ మండల వ్యాప్తంగా జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలు జోరుగా సాగుతున్నాయన్నారు. గృహ నిర్మాణశాఖ వర్క్ ఇనస్పెక్టర్లు, సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్లు గృహ నిర్మాణాల్లో అవకతవకలకు పాల్పడితే దండన తప్పదని హెచ్చరించారు. ఇప్పటికే లబ్ధిదారుల బ్యాంకు ఖాతాలకు నిధులు జమ చేసినట్టు ఎంపీడీఓ ఎంవీఆర్ కుమార్ బాబు తెలిపారు. ఫిబ్రవరి 3వ తేదీ నాటికి జగనన్న కాలనీల్లో ఇళ్లు ఇప్పుడున్న దశ నుంచి మరో దశకు మార్పు చెందాలన్నారు. లబ్ధిదారులకు అవగాహన కల్పించి, ఇళ్ల నిర్మాణం వేగవంతమయ్యేలా సిబ్బంది చొరవ చూపాలని ఎంపీడీఓ కుమార్ బాబు సూచించారు. గృహ నిర్మాణశాఖ ఏఈ అత్తిలి ప్రసాద్ మాట్లాడుతూ మండలానికి 1669 గృహాలు మంజూరు కాగా వాటిలో 431 ఇళ్లు 90 శాతం వరకు పూర్తయ్యాయని తెలిపారు. 152 ఇళ్లు నిర్మాణం పూర్తి కాగా శ్లాబ్ దశలో 88, గోడల దశలో 46, పునాది దశలో 21 ఉండగా 50 మంది లబ్ధిదారులు ఇంకా ఇళ్ల నిర్మాణం చేపట్టలేదని వివరించారు. సమావేశంలో జెడ్పీటీసీ సభ్యురాలు బెహరా రాజరాజేశ్వరి, ఉపాధి హామీ పథకం ఏపీఓ కుమారస్వామి, ఎంపీటీసీ సీంద్రపు భాస్కరరావు, గృహ నిర్మాణశాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేట్‌కు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు



వీరవరంలో విద్యార్థులకు ట్యాబ్‌లు పంపిణీ చేస్తున్న తోట నరసింహం



జె.అన్నవరంలో విద్యార్థులకు ట్యాబ్‌లు అందజేస్తున్న ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి

- వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి తోట నరసింహం

కిర్లంపూడి: కార్పొరేట్‌కు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేసిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని మాజీ ఎంపీ, వైఎస్సార్ సీపీ జగ్గంపేట నియోజకవర్గ ఇన్‌చార్జి తోట నరసింహం అన్నారు. మండలంలోని వీరవరం ప్రభుత్వోన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న 84 మంది విద్యార్థులకు బుధవారం ఆయన ట్యాబ్‌లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక నాడు–నేడు పథకంలో ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మారాయన్నారు. ప్రభుత్వ పథకాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పార్టీ యువ నాయకుడు తోట రాంజీ, తోట బాబ్జీ, సర్పంచ్ అంబటి బుజ్జమ్మ, ఎంపీటీసీ తోట వేణు, తోట విష్ణు, తోట అయ్యన్న, గండేపల్లి ఎంపీపీ చలగల దొరబాబు, హెచ్ఎం ఎస్.దుర్గాప్రసాద్, శెట్టి సోమరాజు, అడారి మహేష్, అడబాల శ్రీను తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు సాంకేతిక పరిజ్ఞానంపై పట్టు సాధించాలి

ఏలేశ్వరం: విద్యార్థులు సాంకేతిక పరిజ్ఞానంపై పట్టు సాధించాలని ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి సూచించారు. మండలంలోని పెద్దనాపల్లి, జె.అన్నవరం, లింగంపర్తి, తిరుమాలి, సిరిపురం గ్రామాల్లోని జెడ్పీ ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో 8వ తరగతి విద్యార్థులకు బుధవారం ఆయన ట్యాబ్‌లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే సాంకేతిక పరిజ్ఞానంపై విద్యార్థులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. ప్రభుత్వ పథకాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో నీరుకొండ సత్యనారాయణ, కొండపల్లి వెంకటేశ్వరరావు, కాలారి సత్తిబాబు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

గ్రామాల్లో వికసిత్ భారత్ సంకల్ప యాత్రలు

రౌతులపూడి: మండలంలోని మల్లంపేట, బీబీపట్నం గ్రామాల్లో బుధవారం ఎంపీడీఓ ఎం.గోవిందు ఆధ్వర్యంలో వికసిత్ భారత్ సంకల్ప యాత్రలు నిర్వహించారు. ఈ సంకల్ప యాత్రల్లో కాకినాడ జిల్లా బీజేపీ అధ్యక్షుడు చిలకూరి రామ్‌కుమార్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం పేదల కోసం అనేక పథకాలను అమలు చేస్తోందన్నారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ పాలనలో దేశం అభివృద్ధి పథంలో దూసుకుపోతోందన్నారు. కేంద్ర ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పశువైద్యాధికారి ఎం.వీరరాఘవరావు, ఎంఈఓ గాడి కొండబాబు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జానకీలక్ష్మి, సర్పంచ్ పోలుపర్తి నూకరత్నం, వి.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

కర్పూరిఠాకూర్‌కు భారతరత్న ప్రకటనపై హర్షం

ఏలేశ్వరం: బీహార్ మాజీ ముఖ్యమంత్రి కర్పూరిఠాకూర్‌కు భారతరత్న ప్రకటించడంపై పట్టణంలోని నాయీబ్రాహ్మణులు బుధవారం హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా నాయీబ్రాహ్మణ సంఘం మండలాధ్యక్షుడు రాజాన చిన్నబ్బాయి మాట్లాడుతూ దేశానికి, రాష్ట్రానికి విశేష సేవలు అందించిన కర్పూరిఠాకూర్‌కు భారతరత్న ప్రకటించడం అభినందనీయమన్నారు. సంఘ నాయకులు తాటితూరి దుర్గాప్రసాద్, బైలపూడి వెంకటేశ్వరావు, పెండ్యాల అప్పారావు, రమేష్, బాబూరావు పాల్గొన్నారు.

ఏలేశ్వరంలో జగనన్న ఆరోగ్య సురక్ష



ఏలేశ్వరంలో రోగులకు పరీక్షలు చేస్తున్న వైద్యుడు పాపారావు

ఏలేశ్వరం: పట్టణంలో బుధవారం రెండో విడత జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. మున్సిపల్ కమిషనర్ కె.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో పట్టణంలోని 16, 19 వార్డుల్లో ఆరోగ్య సురక్ష శిబిరాలు ఏర్పాటు చేశారు. ప్రభుత్వ వైద్యుడు పాపారావు ఆధ్వర్యంలో సిబ్బంది ప్రజలకు వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ పాపారావు మాట్లాడుతూ ప్రభుత్వం వైద్య రంగానికి అధిక ప్రాధాన్యం ఇస్తోందన్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష ద్వారా ప్రతి కుటుంబానికి వైద్య సేవలు అందుతున్నాయన్నారు. ప్రతివార్డులోనూ వైద్య శిబిరాలు నిర్వహిస్తామని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు శిడగం వెంకటేశ్వరరావు, అలమండ చలమయ్య, మసిరపు నాగేశ్వరరావు, తొండారపు రాంబాబు వైద్యసిబ్బంది, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాలు త్వరితగతిన పూర్తి చేయాలి



కాకరాపల్లి జగనన్న కాలనీలో ఇళ్ల నిర్మాణాలను పరిశీలిస్తున్న ఏఈ సాయిబాబా

కోటనందూరు: జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయాలని హౌసింగ్ ఏఈ సాయిబాబా లబ్ధిదారులకు సూచించారు. మండలంలోని కాకరాపల్లి, కేఏ మల్లవరం, పాతకొట్టాం, కేఈ చిన్నయ్యపాలెం గ్రామాల్లోని జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలను బుధవారం ఆయన పరిశీలించారు. ఇళ్ల నిర్మాణాలపై లబ్ధిదారులకు సూచనలు చేశారు. ఉన్నతాధికారుల నుంచి వచ్చిన జాబితా ఆధారంగా మరుగుదొడ్ల నిర్మాణాలను పరిశీలించారు. సక్రమంగా నిర్మించుకున్న మరుగుదొడ్లకు ప్రభుత్వం రూ.12 వేలు ఇస్తుందన్నారు. అలాగే ఇంకుడుకుంతలకు సైతం ప్రభుత్వ ప్రోత్సాహం అందిస్తోందని తెలిపారు. వర్క్ ఇనస్పెక్టర్ రవి పాల్గొన్నారు.

100 మందికి కంటి వైద్య పరీక్షలు



తునిలో రోగులకు కంటి పరీక్షలు చేస్తున్న వైద్యుడు రమేష్‌కుమార్, శోభారాణి తదితరులు

తుని: స్థానిక వాసవి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేస్తున్న ఉచిత కంటి వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ కుసుమంచి శోభారాణి సూచించారు. తుని పుష్ప కంటి ఆసుపత్రిలో బుధవారం ఏర్పాటు చేసిన ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ఆమె ప్రారంభించారు. డాక్టర్లు సుమారు వంద మందికి వైద్య పరీక్షలు చేశారు. వీరిలో 29 మందికి శస్త్ర చికిత్సలు అవసరమని నిర్ధారించి విజయనగరం పుష్పగిరి కంటి ఆసుపత్రికి తరలించారు. డాక్టర్ పి.రమేష్‌కుమార్ ఆధ్వర్యంలో వీరికి శస్త్ర చికిత్స చేయించి శుక్రవారం తునికి తీసుకువస్తామని తెలిపారు. కార్యక్రమంలో అవోగా అధ్యక్షుడు కడిమిశెట్టి సూర్యప్రకాష్, వాసవి చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షుడు కుసుమంచి సత్యనారాయణ, కార్యదర్శి దాసరి నూకయ్యశెట్టి, జి.కోటేశ్వరరావు, బి.నాగేశ్వరరావు, వెంకటరమణ, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

పట్టణాభివృద్ధికి అధిక ప్రాధాన్యం



తునిలో సీసీ రోడ్డు నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ సుధారాణి

తుని: పట్టణాన్ని అన్నివిధాలా అభివృద్ధి చేసేందుకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నామని మున్సిపల్ చైర్‌పర్సన్ ఏలూరి సుధారాణి అన్నారు. స్థానిక ఒకటో వార్డులో దర్గా వద్ద రూ.15 లక్షలతో చేపట్టే సీసీ రోడ్డు నిర్మాణానికి బుధవారం ఆమె భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ సుధారాణి మాట్లాడుతూ కౌన్సిల్ ఏర్పడిన తరువాత మంత్రి దాడిశెట్టి రాజా సహకారంతో పట్టణంలో వందకు పైగా సీసీ రోడ్లను నిర్మించామన్నారు. డ్రైన్లు, పార్కులు, ఆటస్థలాల అభివృద్ధికి పెద్దపీట వేస్తున్నామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్‌చైర్మన్ పామర్తి మహేష్, వైఎస్సార్ సీపీ పట్టణాధ్యక్షుడు రేలంగి రమణాగౌడ్, గాంధీసత్రం చైర్మన్ అనిశెట్టి సూర్యచక్రరెడ్డి, జిల్లా వక్ఫ్‌బోర్డు వైస్ చైర్మన్ షేక్ క్వాజా, మున్సిపల్ కమిషనర్ ప్రసాదరాజు తదితరులు పాల్గొన్నారు.

బాలికలు అన్ని రంగాల్లో రాణించాలి



అల్లిపూడి కేజీబీవీలో విద్యార్థినికి స్టడీ మెటీరియల్ అందజేస్తున్న ఎస్ఓ రాజేశ్వరి



సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు చిలుకూరి రామకుమార్

కోటనందూరు: ఆడపిల్లలు అన్నిరంగాల్లోనూ రాణించాలని మండల ప్రత్యేకాధికారి జి.రాజేశ్వరి సూచించారు. మండలంలోని అల్లిపూడి కేజీబీవీ పాఠశాలలో బుధవారం జాతీయ బాలికా దినోత్సవం, అంతర్జాతీయ విద్యా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సమాజంలో ఆడపిల్లలు ఎదుర్కొంటున్న అవమానాలు, అసమానతలను రూపు మాపేందుకు ప్రతిఒక్కరూ కృషి చేయాలన్నారు. బాలికల అభివృద్ధికి తల్లిదండ్రులు ప్రోత్సాహం అందించాలన్నారు. విద్య, ఆరోగ్యం, పౌష్టికాహారం, సమాన అవకాశాలు, బాలికల హక్కులు, బాల్యవివాహాలు, వివక్ష వంటి అంశాలపై విద్యార్థినులకు అవగాహన కల్పించారు. అనంతరం 10వ తరగతి విద్యార్థినులకు స్టడీ మెటీరియల్ అందజేశారు. కార్యక్రమంలో పీఎంసీ చైర్మన్ సూర్యకుమారి, మహిళ పోలీసు వేణు, జేఈ లలిత, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా జాతీయ బాలికా దినోత్సవం

తొండంగి: మండలంలోని వాకదారిపేట కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయంలో బుధవారం నేషనల్ గర్ల్ చైల్డ్ డేను ఘనంగా నిర్వహించారు. పాఠశాల ప్రిన్సిపాల్ రాజేశ్వరి ఆధ్వర్యంలో ఐసీడీఎస్ సూపర్ వైజర్ విష్ణుకుమారి, కమ్యూనిటీ హెల్త్ అధికారి సౌజన్య బాలికల హక్కులు, బాలికా సంరక్షణ చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా విద్యార్థినులు ప్రదర్శించిన సాంస్కృతిక, సంప్రదాయ నృత్యాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యాశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

రౌతులపూడి: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం శంఖవరం ఐసీడీఎస్ సీడీపీఓ పద్మావతి ఆధ్వర్యంలో జాతీయ బాలికా దినోత్సవం నిర్వహించారు. బీజేపీ కాకినాడ జిల్లా అధ్యక్షుడు చిలకూరి రామకుమార్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం బాలికల సంరక్షణకు చర్యలు చేపట్టిందన్నారు. బాల్య వివాహాలను అరికట్టేందుకు ప్రతిఒక్కరూ కృషి చేయాలన్నారు. బాలికల హక్కులు, ఆరోగ్యం, బాలికా సంరక్షణ చట్టాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సర్పంచ్ కె.అర్జమ్మ, ఉపసర్పంచ్ వి.భాస్కరబాబు, హెచ్ఎం కె.రాంబాబు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జానకీలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



వాకదారిపేట కేజీబీవీలో అలరించిన విద్యార్థినుల నృత్య ప్రదర్శన